

సంక్షేమానికి కృషి

ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 9లో ▸



కొనసాగుతున్న సమ్మె

డిమాండ్లను సాధించుకోవడం కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 27.5 /9.4

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రాజగంగారెడ్డి



భిక్కనూరు: ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా భిక్కనూరు ఎంఈవో, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజగంగారెడ్డి ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి పీఎస్‌ఎం పాఠశాలలో ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. ఈ ఎన్నికలో తాను 103 ఓట్ల ఆధిక్యతతో గెలిచానని రాజగంగారెడ్డి తెలిపారు. ఆయన ఎన్నికపై సర్వశిక్షా అభియాన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వైద్య సంపత్ హర్షం వ్యక్తం చేశారు.

18న జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్ ఎంపికలు

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో ఈనెల 18న జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ తెలిపారు. అండర్–16, 18, 20 కేటగిరీల్లో బాలబాలికలు, మహిళలు, పురుషులకు పరుగు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

ఐకమత్యంతో హక్కులను సాధించుకుందాం



నిజాంసాగర్: ఒక్కటిగా ఉంటేనే హక్కులు సాధించుకోగలమని ఆదివాసి నాయక్‌పోడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పెంటయ్య అన్నారు. శనివారం మహమ్మద్‌నగర్‌లోని సొసైటీ ఫంక్షన్ హాల్‌లో సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. ఈనెల 18, 19 తేదీల్లో కోమలంచలో నిర్వహించే భీమన్న ఆలయ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు సాయిబాబా, సాయిలు, శంకర్, కాశీరాం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–2కు సిద్ధం

- నేడు, రేపు పరీక్షలు
- జిల్లా కేంద్రంలో 19 సెంటర్లు ఏర్పాటు
- పరీక్షకు హాజరుకానున్న 8,085 మంది అభ్యర్థులు
- అమలులో నిమిషం నిబంధన



పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆది, సోమ వారాలలో నిర్వహించే గ్రూప్– 2 పరీక్షకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 8,085 మంది అభ్యర్థులు గ్రూప్–2 పరీక్ష రాయనున్నారు. వీరి కోసం జిల్లా కేంద్రంలో 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

గ్రూప్–2 పరీక్షలకు అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి నోడల్ అధికారిగా, అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి పోలీస్ నోడల్ అధికారిగా, కే.విజయ్‌కుమార్ రీజనల్ కోఆర్డినేటర్‌గా, వి.శంకరయ్య అసోసియేట్ రీజనల్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. పరీక్షల నిర్వహణలో 19 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 19 మంది అబ్జర్వర్లు, ఒక స్పెషల్ అబ్జర్వర్, నలుగురు రూట్ ఆఫీసర్లు, 63 మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, 360 మంది ఇన్విజిలేటర్లు, జిల్లా యంత్రాంగం నుంచి నలుగురు జాయింట్ రూట్ ఆఫీసర్లు, తొమ్మిది మంది ఫ్లయింగ్ స్క్వాడ్స్, 90 మంది ఐడెంటిఫికేషన్ అధికారులు, వంద మందికిపైగా పోలీసు సిబ్బంది పాల్గొంటున్నారు. ప్రతి కేంద్రంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు సమయానికి చేరుకునేందుకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



ఇన్విజిలేటర్లకు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్

2 రోజులు.. 4 పేపర్లు..

గ్రూప్–2 పరీక్షకు సంబంధించి నాలుగు పరీక్షలు ఉంటాయి. తొలిరోజు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో పేపర్ నిర్వహిస్తారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మూడో పేపర్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నాలుగో పేపర్ ఉంటాయి. అభ్యర్థులను ఉదయం పరీక్షకు 8.30 గంటల నుంచి, మధ్యాహ్నం పరీక్షకు 1.30 గంటలనుంచి పరీక్ష కేంద్రంలోనికి అనుమతిస్తారు. ఉదయం సెషన్‌లో 9.30 గంటలకు, మధ్యాహ్నం సెషన్‌లో 2.30 గంటలకు పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేస్తారు. ఆ తర్వాత వచ్చే అభ్యర్థులను కేంద్రాల్లోనికి అనుమతించరు.

అభ్యర్థులకు సూచనలు

- అభ్యర్థులు తమ వెంట హాల్‌టికెట్, బ్లాక్ లేదా బ్లూ బాల్ పాయింట్ పెన్ తీసుకువెళ్లాలి. ఏదేని ఒరిజినల్ గుర్తింపు కార్డు (ఆధార్/డ్రైవింగ్ లైసెన్స్/ఓటరు కార్డు/పాన్ కార్డు/పాస్‌పోర్టు) తప్పనిసరిగా తెచ్చుకోవాలి. ఒకే హాల్ టికెట్‌ను నాలుగు పరీక్షలకు ఉపయోగించుకోవాల్సి ఉంటుంది.
- పరీక్ష కేంద్రంలోనికి బ్యాగులు, సెల్‌ఫోన్లు, స్మార్ట్ ఫోన్లు, వాచ్‌లు, క్యాలిక్యులేటర్లు, పర్సులు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. అభ్యర్థులు షూస్ కాకుండా చెప్పులు ధరించి రావాలి.
- పరీక్షకు బయోమెట్రిక్(వేలిముద్ర), ఫొటో తీసుకోవడం ద్వారా హాజరు నమోదు చేస్తారు. చేతి వేళ్లకు మెహందీ, టాటూలు ఉంటే బయోమెట్రిక్ పరికరం హాజరును గుర్తించదు.
- అభ్యర్థి వివరాలు ముద్రించిన ఓఎంఆర్ షీట్‌పై నలుపు/నీలం బాల్‌పాయింట్ పెన్నుతో బబ్లింగ్ చేయాల్సి ఉంటుంది.
- పరీక్ష వేళలో ప్రతి అరగంటకు ఒకసారి బెల్ కొడతారు. పరీక్ష సమయం పూర్తయ్యే వరకు ఎవరినీ బయటకు వెళ్లడానికి అనుమతించరు. పరీక్ష సమయం పూర్తయిన తర్వాత అభ్యర్థులు తమ ప్రశ్నపత్రాలను వెంట తీసుకువెళ్లాలి.

రాజీతో కేసుల పరిష్కారం

- జిల్లా న్యాయమూర్తి వరప్రసాద్

కామారెడ్డి టౌన్: కక్షిదారులు రాజీకి అంగీకరించడంతో కేసులకు పరిష్కారం చూపామని జిల్లా న్యాయమూర్తి సీహెచ్‌వీఆర్‌ఆర్ వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని న్యాయస్థానంలో న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి వరప్రసాద్, సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి టి.నాగరాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి కృషి చేసిన న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. లోక్ అదాలత్ సందర్భంగా కామారెడ్డి కోర్టు ఆవరణలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జీలు లాల్‌సింగ్, శ్రీనివాస్ నాయక్, జూనియర్ సివిల్ జడ్జి కే.సుధాకర్, అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ దీక్ష, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ రాజగోపాల్ గౌడ్, అశోక్, శివరాం, నిమ్మ దామోదర్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, కోర్టు సూపరింటెండెంట్ చంద్రసేన్‌రెడ్డి పాల్గొన్నారు.

3,397 కేసులు..

జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,397 కేసులకు పరిష్కారం చూపారు. ఇందులో 3,335 క్రిమినల్ కేసులు, 12 సివిల్, 50 ప్రి లిటిగేషన్ కేసులున్నాయి. అలాగే రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన కేసులలో బాధిత కుటుంబాలకు రూ. 86,40,226 నష్ట పరిహారం అందేలా తీర్పులు ఇచ్చారు.



జిల్లా కోర్టులో లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తులు

ఆలయ కమిటీల ఏర్పాటుకు కసరత్తు!

భిక్కనూరు: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయంతో పాటు జిల్లాలోని ఆలయాలన్నింటికీ ఆలయ అభివృద్ధి కమిటీలను నియమించేందుకు కసరత్తు జరుగుతోంది. త్వరలోనే కమిటీలను ప్రకటించే అవకాశాలున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడచింది. ఇంకా చాలా నామినేటెడ్ పదవులు భర్తీ చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆయా పోస్టుల భర్తీపై సర్కారు దృష్టి సారించి, కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఆయా నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ ఇన్‌చార్జీలు, పార్టీ నేతలు ఆలయ కమిటీల చైర్మన్, సభ్యుల నియామకం గురించి చర్చించినట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లాలో కేటగిరి ఏ కింద మూడు, కేటగిరి బీ కింద రెండు, కేటగిరి సీ కింద తొమ్మిది, కేటగిరి డి కింద ఒక ఆలయం ఉన్నాయి. భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయం, చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, మాచారెడ్డి చౌరస్తాలోని వెంకటేశ్వరాలయాలకు సంబంధించి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఇప్పటికే జాబితాలను రూపొందించి ప్రభుత్వానికి పంపినట్లు తెలుస్తోంది. జిల్లాలోని మిగతా ఆలయాల కమిటీల కోసం ఆయా నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.



నకిలీ నోట్ల ముఠా గుట్టు రట్టు

- చెలామణికి సిద్ధంగా ఉన్న రూ.56.90 లక్షలు స్వాధీనం
- ఆరుగురు నిందితుల అరెస్టు, పరారీలో మరో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సింధు శర్మ



వివరాలు తెలుపుతున్న ఎస్పీ సింధు శర్మ

కామారెడ్డి టౌన్: నకిలీ కరెన్సీ నోట్లు తయారు చేస్తూ చెలామణి చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగ నోట్ల తయారీ ముఠా గుట్టును జిల్లా పోలీసులు రట్టు చేశారు. ముఠాలో ఎనిమిది మందిని గుర్తించి ఆరుగురిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఈ విషయమై శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎస్పీ సింధు శర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాన్సువాడ పోలీసులు శుక్రవారం కొయ్యగుట్ట వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో ఓ కారులోని వ్యక్తులు పోలీసులను చూసి కారును వదిలి పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి ముగ్గురిని పట్టుకున్నారు. ఇందులో జిల్లాలోని బిచ్కుందకు చెందిన కోలావర్ కిరణ్ కుమార్, బాన్సువాడకు చెందిన కె.రమేష్‌గౌడ్‌తో పాటు హైదరాబాద్ కొంపల్లికి చెందిన కడపత్రి రాజ్‌గోపాల్ ఉన్నారు. వారి వద్దనుంచి రూ. 30 లక్షల విలువ చేసే నకిలీ రూ. 500 నోట్లను స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా తెలంగాణ, కర్ణాటక, రాజస్థాన్, ఉత్తరాఖండ్, మహారాష్ట్రకు చెందిన 8 మంది ముఠాగా ఏర్పడి దందాకు పాల్పడుతున్నట్లు తేలింది. వీరిలో తెలంగాణకు చెందిన రాజగోపాల్, కర్ణాటకకు చెందిన హుసేన్ పీరా నకిలీ నోట్ల తయారీ, చెలామణిలో పెట్టుబడి పెడతారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కమలేష్, సుఖ్‌రాం, ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన రాధాకృష్ణలు కలిసి నకిలీ కరెన్సీని తయారు చేస్తారు. కామారెడ్డి జిల్లాకు చెందిన కిరణ్ కుమార్, రమేశ్ గౌడ్, మహారాష్ట్రకు చెందిన అజయ్ ఈశ్వర్ వీటిని చెలామణి చేస్తున్నారు.

చిక్కారిలా..

హైదరాబాద్‌లోని గౌలిగూడ, సీటీసీలలో నకిలీ నోట్ల తయారీకి అవసరమయ్యే సామగ్రిని కొనుగోలు చేసి బోయిన్‌పల్లిలోని అంటిలియా అపార్ట్‌మెంట్‌లో పెంట్‌హౌజ్‌లో ఇప్పటివరకు రూ.60 లక్షల విలువ చేసే రూ.500 నకిలీ నోట్లు ప్రింట్ చేశారు. ఇందులో రూ.3 లక్షలను బిచ్కుందకు చెందిన కిరణ్ కుమార్, బాన్సువాడకు చెందిన రమేశ్ గౌడ్‌కు చెలామణి కోసం అప్పగించారు. వారు వాటిని చుట్టుపక్కల గ్రామాల్లో చెలామణి చేశారు. మరో రూ.30 లక్షలను హైదరాబాద్ నుంచి రాజగోపాల్ బాన్సువాడకు తీసుకువచ్చి కిరణ్‌కుమార్, రమేష్‌గౌడ్‌లకు అప్పగించాడు. అయితే తిరిగి రాజ్‌గోపాల్‌ను బాన్సువాడ బస్టాండులో దింపడానికి కిరణ్ కుమార్, రమేష్‌గౌడ్‌లు కారులో బయలు దేరిన క్రమంలో బాన్సువాడలోని కొయ్యగుట్ట వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. రూ.30 లక్షలు స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుల సమాచారం మేరకు హైదరాబాద్‌లో తనిఖీలు చేపట్టి మిగతా రూ.26.90 లక్షల విలువైన రూ.500 నోట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే నోట్ల తయారీకి వినియోగించే కంప్యూటర్ పరికరాలు, కలర్ ప్రింటర్, ఇంక్ బాటిల్స్, పేపర్ బెండల్స్, కట్టర్స్, కలర్ రిబ్బన్స్, నిందితులు వాడుతున్న టీఎస్17 జి 1036 నంబర్ గల వ్యాగన్‌ఆర్ కారు, ఆరు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు రాజగోపాల్, హుసేన్ పీరా, కిరణ్ కుమార్, రమేష్ గౌడ్, రాధాకృష్ణ, అజయ్ ఈశ్వర్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్పీ తెలిపారు. కమలేష్, సుఖ్‌రాంలు పరారీలో ఉన్నారన్నారు. నిందితుల నుంచి రూ.56 లక్షల 90 వేల విలువ చేసే రూ.500 నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఈ కేసును చురుకుగా ఛేదించిన సీసీఎస్ ఎస్సై శ్రీనివాస్, బాన్సువాడ పట్టణ, పిట్లం ఎస్సైలు అశోక్, రాజు, సీసీఎస్ ఎస్సై ఉస్మాన్, రాజేశ్వర్, ఏఎస్సై కిషన్, కానిస్టేబుల్స్ గణపతి, రాజేందర్, శ్రావణ్‌లను ఎస్పీ అభినందించారు.



పట్టుకున్న నకిలీ కరెన్సీ, ముద్రణ సామగ్రిని చూపుతున్న ఎస్పీ సింధు శర్మ

హాస్టళ్లలో కామన్ డైట్ మెనూ

- అట్టహాసంగా ప్రారంభం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ, అధికారులు




పెద్దకొడప్‌గల్‌లో కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులందరికీ ఒకే రకమైన భోజనం అందించే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఆయా గురుకులాల్లో నిర్వహించిన కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వం డైట్ చార్జీలు నలభై శాతం, కాస్మెటిక్ చార్జీలు రెండు వందల శాతం పెంచిందని వక్తలు పేర్కొన్నారు. చార్జీలను గణనీయంగా పెంచినందున మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

ఎవరెక్కడ..

బాన్సువాడ మండలంలోని బోర్లం మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో కామన్ డైట్ మెనూను ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ ప్రారంభించారు. కామారెడ్డి నియోజకవర్గంలోని జంగంపల్లి బీసీ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, జుక్కల్ నియోజకవర్గంలోని పెద్ద ఎక్లారా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని తక్కడ్‌పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కామారెడ్డి పట్టణ పరిధిలోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ సింధు శర్మ, గాంధారిలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో జిల్లా అటవీ అధికారి నిఖిత, బాన్సువాడలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సబ్ కలెక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు. రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయి సాంఘిక సంక్షేమ పాఠశాలలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డి పట్టణంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో అదనపు కలెక్టర్ విక్టర్, తాడ్వాయిలోని బాలికల గురుకుల పాఠశాలలో సీపీవో రాజారాం కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

భిక్కనూరు: అన్నం పరబ్రహ్మ స్వరూపమని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం జంగంపల్లిలోని గురుకుల పాఠశాలలో కామన్ డైట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆహారాన్ని వృథా చేయవద్దన్నారు. ఆహారాన్ని ఉత్పత్తి చేయడానికి రైతు ఇరవై నాలుగు గంటలూ శ్రమిస్తాడన్నారు. దేనికి విలువ కట్టగలిగినా రైతు శ్రమకు మాత్రం విలువకట్టలేమన్నారు. ప్రభుత్వం 40 శాతం మెస్ చార్జీలను పెంచిందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నిత్యావసర వస్తువుల ధరలను చూస్తే ఈ పెంపుదల సరిపోదని, ఇంకో 30 శాతం వరకు పెంచాలని కోరారు. హాస్టల్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్, ప్రిన్సిపాల్ మాధవి, టీచర్లు పాల్గొన్నారు.

'బాగా చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలి'

నిజాంసాగర్/పెద్దకొడప్‌గల్: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాలలో నూతన కామన్ డైట్ మెనూను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం డైట్ చార్జీలను 40 శాతం పెంచి, అన్ని సంక్షేమ హస్టళ్లలో ఒకే విధమైన మెనూ అమలు చేస్తోందన్నారు. చికెన్, మటన్ వంటి పౌష్టికాహారం అందిస్తోందని పేర్కొన్నారు. జిల్లా, మండల, విద్యాసంస్థలవారీగా ఫుడ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేశామని, ఆయా కమిటీలు వంటలను రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు భోజనం అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆయన గురుకుల పాఠశాల డార్మిటరీ, టాయిలెట్స్‌ను పరిశీలించారు. అవసరమైన మరమ్మతుల కోసం రూ. 5 లక్షలు మంజూరు చేయిస్తానని, వెంటనే పనులు ప్రారంభించాలని ప్రిన్సిపాల్ సునీతకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం కలెక్టర్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం టాయిలెట్స్ పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కిషన్, తహసీల్దార్ దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను అడ్డుకున్న పోలీసులు

విద్యార్థుల తల్లిదండ్రులు గురుకులంలోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లడానికి లోనికి రావడానికి ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకుని గేటు వేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీనిని గమనించిన కలెక్టర్ వారిని లోపలికి పంపించాలని ఆదేశించారు. వారు చెప్పిన విషయాలను విని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

'తెలంగాణలోనూ అధికారంలోకి వస్తాం'

కామారెడ్డి టౌన్: తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సంఘటన పర్వ్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో నూతన బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అందరి సమన్వయంతో మండల కమిటీలను ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, నాయకులు మురళీధర్ గౌడ్, నేరెళ్ల ఆంజనేయులు, బాణాల లక్ష్మారెడ్డి, నీలం రాజులు, పైలా కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, రాము, లక్ష్మారెడ్డి, లింగారావు, శ్రీనివాస్, మోటూరి శ్రీకాంత్, వేణు, బాలరాజు, సంతోష్ రెడ్డి, నెహ్వాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్

క్లుప్తంగా

కాల్వలో బెడ్ వేసిన అధికారులు



సాక్షి ఎఫెక్ట్..

లింగంపేట: మండల కేంద్రంలో డ్రయినేజీతో పాటు రెండు కుంటలకు వెళ్లే మత్తడి కాల్వ మధ్యలో సీసీ వేయకుండానే సైడ్ వాల్స్ నిర్మాణం చేపడుతున్నారని శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'నాణ్యత లోపిస్తే ఆందోళన చేస్తాం' అనే శీర్షికకు అధికారులు స్పందించారు. శనివారం రెండు చోట్ల కాల్వ మధ్యలో నీటి పారుదల శాఖ అధికారులు బెడ్ వేయించారు. ఆదివారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించిన తర్వాత కాల్వ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నస్రుల్లాబాద్: మండలంలోని మైలారంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిరాం యాదవ్, మాజీ ఎంపీటీసీ మహేందర్, నాయకులు చంద్రా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రోమోర్ లక్కీ డీప్ విజేతకు బైక్ అందజేత



మాచారెడ్డి: కోరమండల్ గ్రోమోర్ నిర్వహించిన రైతు సంబురాల్లో పాల్వంచ మండలం బండరామేశ్వరపల్లి గ్రామానికి చెందిన బాశెట్టి శ్రీనివాస్ లక్కీ డీప్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను గెలుచుకున్నారు. ఈ మేరకు శనివారం గ్రామంలో నిర్వహించిన రైతు సంబురాల్లో వాహనానికి సంబంధించిన కీని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో గ్రోమోర్ ప్రతినిధులు మనోజ్ కుమార్, పాపిరెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విద్యార్థుల కోసం క్యాంటీన్ నిర్వహించేందుకు ఆసక్తిగల వారు ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ శనివారం తెలిపారు. కళాశాల పనిదినాల్లో క్యాంటీన్ నిర్వహించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

సీఐఎస్ఎఫ్‌కు పద్మాజీవాడి యువకుడి ఎంపిక



సదాశివనగర్: మండలంలోని పద్మాజీవాడి గ్రామానికి చెందిన మామిండ్ల భగత్ సీఐఎస్ఎఫ్‌లో ఉద్యోగం సాధించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇటీవల వెలువడ్డ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. యువకుడికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

రేపటి నుంచి శబరిమాత మహోత్సవాలు

- ఏర్పాట్లు చేస్తున్న ఆశ్రమ నిర్వాహకులు
- తరలిరానున్న భక్తులు



ఉత్సవాలకు ముస్తాబైన ఆశ్రమం

తాడ్వాయి: మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో 54వ వార్షిక మహోత్సవాలను ఆదివారం నుంచి నిర్వహించేందుకు ఆశ్రమ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలను ఆదివారం, సోమవారం నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం సుప్రభాత ధ్యానంతో కార్యక్రమం ప్రారంభమవుతుందని, గోమాత పూజ, ధ్వజారోహణం ఉంటుందని అన్నారు. ఉదయం 8 గంటలకు వందలాది భక్తులు గ్రామంలో భిక్షాటన చేస్తారని ఆశ్రమ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భక్తులు ఇంటింటికి తిరుగుతూ బియ్యం, నగదును పోగు చేస్తారు. మధ్యాహ్నం 12గంటలకు వేదపండితులు శ్రీవేంక టేశ్వర కల్యాణం, దత్తాత్రేయ జయంతి కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. రాత్రి వేళలో సాంస్కృతిక కార్యక్రమాలు, జానపదగీతాలు, నృత్యాలు ఉంటాయి. వేలాది భక్తుల మధ్య కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారి గుండా పాత బస్టాండ్ వరకు రథయాత్ర ఉంటుంది. 16న సోమవారం హంస వాహనంలో శబరిమాత చిత్రపటాన్ని భజన కార్యక్రమాలు చేస్తూ గ్రామంలో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహిస్తారు. అనంతరం ఊర గట్టుపై ఏర్పాటు చేసిన స్టేజిపై వేద పండితులతో పాదుక పూజ ఉంటుంది. గోపూజ, నిత్య పూజ, మహాభిషేకం, ధ్యాన పారాయణ, సంకీర్తనలతో పాటు మహాత్ముల ఉపన్యాసాలు ఉంటాయి. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్త బృందాలచే భజన కార్యక్రమాలు ఉంటాయి. ఈ ఉత్సవాలకు ఆరు లక్షల మంది భక్తులు హాజరవుతారని, భక్తుల సౌకార్యర్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. కామారెడ్డి బస్‌డిపో నుంచి తాడ్వాయిలోని శబరి మాత ఆశ్రమం వరకు ప్రత్యేక బస్సులు నడుస్తాయని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.



కమ్ముకున్న పొగమంచు

మద్నూర్: మద్నూర్‌లో శనివారం ఉదయం మంచుదుప్పటి కప్పుకుంది. ఉదయం వేళ మంచు ఎక్కువగా ఉంటుండడంతో రోడ్డుపై ఎదురుగా వచ్చే వాహనాలు కనబడటం లేదు. ప్రతి రోజు వణకిస్తున్న చలితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్తమా ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

శిథిలావస్థలో పాఠశాల



ఊడిపోయిన స్లాబ్ పెచ్చులు

బిచ్కుంద: మండలంలోని దౌల్తాపూర్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరింది. పాఠశాల స్లాబ్‌పై కప్పు సిమెంటు పెచ్చులు ఊడి విద్యార్థులపై పడుతున్నాయి. అది ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారు. అన్ని తరగతులకు ఒకే గది ఉంది. వరండాలో కూర్చుని చదువుకునే విద్యార్థులు కూలిన స్లాబ్ పెచ్చులతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కు బిక్కుమంటు కూర్చుంటున్నారు. మర్మతులు చేపట్టాలని గతంలో అధికారులకు గ్రామస్తులు వినతిపత్రం అందించినా స్పందించలేదు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శిథిలావస్థకు చేరిన గదులకు మర్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అట్రాసిటీ కేసుపై త్వరలో విచారణ

నిజామాబాద్ రూరల్: నగరంలోని కేఆర్‌కే అపార్ట్‌మెంట్ వద్ద ప్లాటు వివాదంలో మాజీ సీఎం కేసీఆర్ వియ్యంకుడు రాంకిషన్‌రావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన విషయం తెలిసిందే. ఆయన అనుచరులు నగేశ్, సూదం రవిపై సైతం కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో ఏసీపీ ఆధ్వర్యంలో త్వరలో విచారణ చేపట్టిన అనంతరం తదుపరి చర్యలు ఉంటాయని రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ శనివారం తెలిపారు. ప్లాటు వివాదంపై రాష్ట్రంలో రాజకీయ కోణంలో సోషల్ మీడియాతోపాటు పత్రికల్లో పెద్ద ఎత్తున ప్రచారం కొనసాగుతోంది.

ఆధ్యాత్మికం

శబరిమాత ఆశ్రమంలో భజనలు

తాడ్వాయి: మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో భక్తులు శనివారం ప్రత్యేక భజనలు చేశారు. అలాగే ఆలయం ప్రాంగణంలోని వేంకటేశ్వర, దత్తాత్రేయా, మార్కెండేయ ఆలయాల్లో పూజలు చేపట్టారు. భజన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మూడు కిలోల వెండి పళ్లెం బహూకరణ



తాడ్వాయి: మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమానికి నల్గొండ జిల్లాకు చెందిన సతీశ్, సంతోషి అనే దంపతులు మూడు కిలోల వెండి పల్లెంను శనివారం బహూకరించారు. ఆలయంలో వెండిని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



బాన్సువాడ: స్వామియే శరణమయ్యప్పా అంటూ బీర్కూర్ ప్రాంతం మార్మోగింది. శుక్రవారం రాత్రి బీర్కూర్ మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో నిర్వహించిన అయ్యప్ప పడి పూజ ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం, రాత్రి పడి పూజ చేపట్టారు.కార్యక్రమంలో గుడికొండ లింగం, మాదప్ప,సుభాష్,శంకర్,సాయిలు తదితరులు ఉన్నారు.

పిట్లంలో..

పిట్లం: పిట్లంలో అయ్యప్ప స్వాములు శనివారం అయ్యప్ప ఆరట్టు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తులు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో స్వాములు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప పూజ

లింగంపేట: మండల కేంద్రంలోని ఉత్తర శబరిమల అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప మహాపడి పూజ నిర్వహించనున్నట్లు గురు స్వాములు చంద్రమౌళి, శ్రీకాంత్, రవిగౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమాన్ని భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

అయ్యప్ప ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

బిచ్కుంద: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో హుండీ ఆదాయాన్ని శనివారం సేవా సమితి ఆధ్వర్యంలో లెక్కించారు. రూ.76 వేల నగదు, రెండు తులాల వెండి వచ్చినట్లు ఆలయ అధ్యక్షుడు అస్పత్‌వార్ అశోక్ తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ్, దన్నారం శ్రీనివాస్, విష్ణు, బాల్‌రాజ్ రమణ పాల్గొన్నారు.

నేడు సామూహిక నవదుర్గ వ్రతం

కామారెడ్డి అర్బన్: స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీశారదా ఆదిశంకర ఆలయంలో ఆదివారం ఉదయం 11గంటలకు పౌర్ణమి సందర్భంగా సామూహిక నవదుర్గ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వ్రతంలో పాల్గొనే వారికి ఆలయ కమిటీ తరఫున పూజసామాగ్రి సమకూర్చనున్నట్లు పేర్కొన్నట్లు

ఆలయానికి విరాళం

నస్రుల్లాబాద్: మండలంలోని మైలారంలో ఉన్న కొచ్చెరి మైసమ్మ ఆలయ అభివృద్ధికి ఎల్‌ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్ శివరామకృష్ణ రూ. పది వేల విరాళం అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెర్క శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సాయిరాం యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు సాయిలు, జగన్, వడ్ల వెంకటి, గ్రామస్తులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో పూజలు



మద్నూర్: మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో శనివారం భక్తులతో సందడిగా మారింది. కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు విజయ్, అరవింద్, శైలేంద్ర మహరాజ్ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

హనుమాన్ ఆలయంలో నీటిసరఫరా

తాడ్వాయి: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో శనివారం నీటి సరఫరా పనులను నిర్వహించారు. తాడ్వాయికి చెందిన ఉపాధ్యాయుడు రాజాగౌడ్ తన స్వంత నిధులు రూ. 20వేలతో పైప్ లైన్ ఏర్పాటు చేశారు. దీంతో ఆలయానికి వచ్చిన భక్తులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంగారెడ్డి, దాత ఏఎంసీ మాజీ చైర్మన్ శ్యాంరావు, గ్రామపెద్దలు బాగారెడ్డి, సునీల్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యం

- ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బోర్లంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ: నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన భోజనం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడ మండలంలోని బోర్లం మైనారిటీ గురుకుల పాఠశాలలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి న్యూకామన్ డైట్ మెనూను శనివారం ప్రారంభించారు. అంతకుముందు కూరగాయలు, పప్పులు, నూనెలు, వంట వస్తువులను పరిశీలించారు. నిత్యవసరాల సరుకుల ధరలు పెరిగిన నేపథ్యంలో గురుకుల పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి గొప్ప నిర్ణయం తీసుకున్నారని అన్నారు. మూడు నుంచి ఏడో తరగతి వరకు చదివే ఒక్కో విద్యార్థికి రూ.950 ఉన్న డైట్ చార్జీని రూ.1330కి పెంచారని, ఎనిమిది నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు డైట్ చార్జీని రూ.1100 నుంచి రూ.1540కి పెంచారని అన్నారు. ఇంటర్ నుంచి పీజీ వరకు డైట్ చార్జీని రూ.1500 ఉంటే రూ.2100కు పెంచారని అన్నారు. గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థులు పేదవారే ఉంటారని వారిని సొంత పిల్లల్లాగా చూసుకోవాలని ఉద్యోగులు, సిబ్బందికి సూచించారు. పాఠశాల పరిసరాలు, విద్యార్థులకు అందించే భోజనం తీరును చూసి ప్రిన్సిపాల్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, నాయకులు కృష్ణారెడ్డి, ఖలేక్, ఎజాస్, పర్వారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి, నర్సింలు, వాహబ్, మన్నెచిన్న సాయిలు, షహబ్, ఆమేర్, అజీం ఉన్నారు.

చదువుతోనే మంచి భవిష్యత్తు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎస్పీ

కామారెడ్డి టౌన్: చదువుతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎస్పీ సింధూశర్మ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌లో నూతన డైట్ మెనూను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులో కలసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను చక్కగా అర్థం చేసుకోవాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



కామారెడ్డి జిల్లాలో ఎంపికైన క్రీడాకారులు

మాక్లూర్(ఆర్మూర్)/నిజాంసాగర్(జుక్కల్): ఉమ్మడి జిల్లాలోని మాక్లూర్ మండలం కల్లెడి, జుక్కల్ మండలం కౌలాస్ ప్రభుత్వ పాఠశాలల మైదానాల్లో శనివారం సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ ఆదేశాల మేరకు ఎంపికలు నిర్వహించిన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గంగామోహన్, ప్రధాన కార్యదర్శి పింజా సురేందర్ తెలిపారు. కల్లెడిలో నిర్వహించిన ఎంపిక పోటీలకు 80 మంది హాజరుకాగా 12 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే ఏడాది జనవరి 27 నుంచి 30వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న రెండో ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్‌జూనియర్ బాయ్స్ హ్యాండ్ బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని హ్యాండ్‌బాల్ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆయా చోట్ల ఎంపికల్లో సంఘం కోశాధికారి జి రాజేశ్, సభ్యులు బి బాబు రావు, పీడీలు రమణ, మాధురి, కిశోర్, సతీశ్‌రెడ్డి, పీఈటీలు ప్రవీణ్, లింగం, సీనియర్ హ్యాండ్ బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.



నిజామాబాద్ జిల్లాలో ఎంపికైన క్రీడాకారులు

న్యూసెన్స్ చేసిన వ్యక్తి రిమాండ్

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట న్యూసెన్స్ చేసిన బురుడుగల్లీకి చెందిన జంబిలం దిలీప్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్సై యాసీన్ అరాఫత్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. జల్సాలకు అలవాటు పడిన దిలీప్ డబ్బుల కోసం తన తల్లినికొట్టేవాడు. ఈ నెల 9వ తేదీన సైతం డబ్బులు ఇవ్వకుంటే చంపేస్తానని బెదిరించడంతో ఆమె డయల్ 100కి కాల్ చేసింది. పోలీస్ సిబ్బంది వాళ్లింటికి వెళ్లగా, దిలీప్‌కు భయపడి అతనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు తల్లి రాగా అమె వెనకాలే ఇంట్లో నుంచి కూరగాయల కత్తిని తీసుకొని వచ్చాడు. తల్లి డబ్బులు ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానని తను తెచ్చుకున్న కత్తితో మెడ, చాతి కుడి భాగంపై గాయపర్చుకోవడంతో గమనించిన పోలీసులు జీజీహెచ్‌కి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలోనూ ప్రభుత్వ ఆస్పత్రిలో కూడా డాక్టర్లతో దిలీప్ అసభ్యంగా ప్రవర్తించి న్యూసెన్స్ చేశాడు. ఈ నేపథ్యంలో దిలీప్‌పై కేసు నమోదు చేసి శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దిలీప్‌కు న్యాయస్థానం 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించిందని ఎస్సై తెలిపారు. జంబిలం దిలీప్‌పై ఇప్పటికే టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నాలుగు కేసులు ఉన్నాయన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి డీసీఎంలో తరలిస్తున్న 21 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారని, డీటీ వినోద్ పంచనామా నిర్వహించారన్నారు. నిందితులైన డీసీఎం డ్రైవర్ జాకీర్, డీసీఎం యజమాని రావూఫ్, మదనం ఎల్లయ్యను స్టేషన్‌లో అప్పగించారని తెలిపారు. అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సెల్‌ఫోన్లు అప్పగింత



ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో రైళ్లలో సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వారికి సెల్ ఫోన్లను తిరిగి అందజేసినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి శనివారం తెలిపారు. డిసెంబర్ నెలలో రైళ్లలో ప్రయాణం చేస్తున్న సమయంలో పలువురు ఫోన్‌లు పోగొట్టుకుని తమకు ఫిర్యాదు చేయగా, సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా పది ఫోన్‌లను రికవరీ చేశామన్నారు. రైళ్లలో సెల్‌ఫోన్‌లు పోతే రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

నీటి తొట్టిలో పడి మహిళ మృతి

బీబీపేట: ప్రమాదవశాత్తు కాలు జారి నీటి తొట్టిలో పడిన మహిళ మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని తుజాల్‌పూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పులి రాములమ్మ(53) రోజులాగే తమ వ్యవసాయ పొలం వద్దకు గేదెను మేపడానికి వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో భర్త సత్తయ్య పొలానికి వెళ్లి చూడగా పొలంలో వద్ద ఉన్న నీటి తొట్టిలో పడి మృతి చెంది ఉంది. రాములమ్మ కాళ్లు, చేతులు కడుక్కునేందుకు నీటి తొట్టి పైకి ఎక్కి ప్రమాదవశాత్తు అందులో జారి పడి ఉంటుందని భర్త తెలిపారు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని పంచనామ నిర్వహించారు. భర్త సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

అదృశ్యమైన వ్యక్తి శవమై కనిపించాడు

మాక్లూర్: రెండు రోజుల క్రితం అదృశ్యమైన మండలంలోని గొట్టిముక్కల గ్రామానికి చెందిన తొర్లికొండ సురేశ్ (37) శనివారం రాత్రి ముల్లంగి (బి) శివారులోని బొడగుట్ట ప్రాంతంలో శవమై కనిపించాడు. ఈనెల 13న ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన సురేశ్ తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో శనివారం ఉదయం సురేశ్ భార్య భవ్యశ్రీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇదిలా ఉండగా, శనివారం రాత్రి 7గంటల సమయంలో ముల్లంగి(బి) శివారులోని బొడగుట్టపై చెట్టుకు సురేశ్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సురేశ్ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

చెరువులో గేదెల కాపరి గల్లంతు

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామ చెరువులో గేదెల కాపరి గల్లంతయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కోటగిరి మండలం కొత్తపల్లికి చెందిన మక్కల చిన్న సాయిలు(40) భార్య నవనీతతో కలిసి రెంజర్లలో ఉంటూ పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. భార్యాభర్తలు శనివారం గేదెలను మేపేందుకు వెళ్లారు. చెరువులోకి దిగిన గేదెలను బయటికి తీసుకువచ్చే క్రమంలో చిన్నసాయిలు నీటిలో మునిగిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు.

ఒకరి బైండోవర్

మాచారెడ్డి: మద్యం మత్తులో డయల్ 100కు కాల్‌చేస్తూ పోలీసుల సమయాన్ని వృథా చేస్తున్న సోమారంపేట గ్రామానికి చెందిన బానోత్ రమేశ్‌ను శనివారం మాచారెడ్డి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. డయల్ 100ను దుర్వినియోగం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై స్పష్టం చేశారు.

కామారెడ్డిలో చైన్ స్నాచింగ్



విచారిస్తున్న పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలోంచి దుండగులు 3 తులాల బంగారం గొలుసును ఎత్తుకెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కాలనీకి చెందిన రాగుల భాగ్యమ్మ అనే మహిళా ఇంటికి దగ్గరలోని కిరాణా దుకాణానికి ఉదయం 8గంటల ప్రాంతంలో నడుచుకుంటూ వెళ్తుండగా, ఇద్దరు వ్యక్తులు బైక్‌పై ఆమె వద్దకు వచ్చారు. ఓ వ్యక్తి బైక్ దిగి భాగ్యమ్మ మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కుని బైక్‌పై పరారయ్యారు. సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.